క్లుప్తంగా

వరి నాటులో జాగ్రత్తలు పాటించాలి

వ్యవసాయ అధికారి లావణ్య



వరి నాటును పరిశీలిస్తున్న ఏఓ లావణ్య

శివ్వంపేట(నర్సాపూర్): వరినాటు వేసేటప్పుడు పలు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి లావణ్య అన్నారు. మంగళవారం శివ్వంపేటలో వరి నాట్లను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. నాటు వేసే ముందు వరి మొక్క కొనలను తుంచి నాటు వేయాలన్నారు. దీంతో లాభదాయకంగా ఉంటుందన్నారు. ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ సాగుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నాటు వేసిన వారం పది రోజుల్లో 3జీ/4జీ గుళికలు ఒక ఎకరానికి 800 గ్రాములు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ వినిత, భవానీ ఉన్నారు.

మార్గదర్శకాలు పాటించాలి

కాంగ్రెస్ నేత రాజిరెడ్డి



కొప్పులపల్లిలో ఇంటి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న రాజిరెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఆ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి అన్నారు. మంగళవారం మాసాయిపేట మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ గూడు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌నాగిరెడ్డి, నాయకులు సిద్దిరాములుగౌడ్, నర్సింలు, నాగరాజు, ఎల్లప్ప, భిక్షపతి, యాదవరెడ్డి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

సాగులో మెలకువలు పాటించాలి



పెసర పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

పెద్ద శంకరంపేట (మెదక్): రైతులు పంటల సాగులో మెలకువలు పాటించాలని ఇన్‌చార్జి ఏవో కృష్ణ అన్నారు. మంగళవారం పెద్ద శంకరంపేట మండలంలోని ఆయా గ్రామాలలో రైతులు సాగు చేస్తున్న మినుము, పెసర, వరి, పత్తి పంటలను ఆయన పరిశీలించారు. నాటు వేసే సమయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, అధిక మోతాదులో ఎరువులు వాడకుండా సేంద్రియ ఎరువులను వినియోగించాలని సూచించారు. పంటలు రోగాల బారిన పడకుండా వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ అధిక దిగుబడులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో మమత, అఖిల్, వినీత్ తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు అండగా భవిత కేంద్రాలు

ఎంఈఓ యాదగిరి

వెల్దుర్తి(తూప్రాన్): సమాజంలో వేసే ప్రతి అడుగుకూ అంగవైకల్యం అడ్డుకారాదు.. మనోస్థైర్యంతో ముందుకెళ్లాలనే యోచనతో ప్రభుత్వం దివ్యాంగులకు భవిత కేంద్రాల ద్వారా శిక్షణ ఇస్తుందని ఎంఈఓ యాదగిరి, మెదక్ సీఎంఓ రాజు పేర్కొన్నారు. వెల్దుర్తి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం భవిత కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పుట్టుకతో, చిన్న వయస్సులో వైకల్యం ఏర్పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఈ కేంద్రాలు ఎంతో భరోసా ఇస్తున్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య, సృజన, వరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

తూప్రాన్: అంగన్‌వాడీ టీచర్లకు ప్రాథమిక విద్యతో పాటు ఆటపాటపై మంగళవారం మున్సిపల్ సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా తూప్రాన్, మనోహరాబాద్, శివ్వంపేట మండలాల్లోని టీచర్లకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శివకుమారి, వసుమతి, మేహత, సంతోష, సుజాతలు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు ఆట–పాటలతో ప్రతిరోజు అంగన్‌వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్య, మంచి అలవాట్లు, సంభాషణ, ఆట, పాట, కథ, సృజనాత్మకత, శాస్త్రీయ పరిజ్ఞానం మొదలగు అన్ని విషయాలపై టీచర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శివకుమారి, వసుమతి, మేహత, సంతోష, సుజాత పాల్గొన్నారు.

బోనాల సంబురం



ఆషాఢమాసం ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ఏడీదుల ఎల్లమ్మ కాలనీలో మహిళలు బోనాల ఊరేగింపు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు ఎల్లమ్మ ఆలయం వద్ద బోనాలను సమర్పించారు. అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

– రామాయంపేట(మెదక్):

వెంకటాపూర్ తండాకు భగీరథ నీరు



కుళాయి నుంచి నీరు వస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

నిజాంపేట మండలంలోని కె వెంకటపూర్ తండాకు మిషన్ భగీరథ నీటిని విడుదల చేశారు. 'రంగు మారిన నీరు'శీర్షికపై సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ట్యాంక్‌లకు మిషన్ భగీరథ నీటిని విడుదల చేశారు. భగీరథ నీరు రానప్పుడు మాత్రమే బోరు మోటారును వాడుకోవాలని అధికారులు సూచించారు. కాగా, భగీరథ సరఫరా కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

నిజాంపేట(మెదక్):

కాల్వల మరమ్మతు కలేనా..!

చెరువుల ఆయకట్టు కింద మట్టి కాల్వలే దిక్కు

- మూసుకుపోతున్నా పట్టించుకోని వైనం
- ఆయకట్టు స్థిరీకరణ అంతంత మాత్రమే



నీళ్లులేక పడావుగా ఉన్న భూమి



చెరువు కింద పూడుకుపోతున్న మట్టి కాల్వలు

రేగోడ్(మెదక్): రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు అనేక పథకాలు చేపడుతున్నప్పటికీ పంటకు ప్రాణధారమైన నీటిని పారబెట్టేందుకు కనీస చర్యలు తీసుకోవడం లేదు. పంట కాల్వలు మరమ్మతుకు నోచుకోవడం లేదు. కాల్వలు నిర్మించాలని దశాబ్దాల కాలంగా మొర పెట్టుకుంటున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారని ఈ ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 506 చెరువులు, 950 కుంటలు ఉన్నాయి. వీటి కింద సుమారు 46, 270 ఎకరాలు ఆయకట్టు ఉంది.1,385 కిలోమీటర్ల మేర కు పంట కాల్వలు ఉన్నాయి. ఇంకా 676 కిలోమీటర్లు కాల్వలు నిర్మించాల్సి ఉందని అధికారుల అంచనా. చెరువుల నుంచి పంటలకు నీళ్లు పారాలంటే తప్పనిసరిగా సిమెంటు పంట కాల్వలు నిర్మించాల్సి ఉంది. కానీ.. చాలా చెరువుల కింద కాల్వల నిర్మాణాలను పట్టించుకోవడం లేదని రైతులు చెబుతున్నారు. ఉన్న మట్టి కాల్వలు, చెట్లు, మట్టితో మూసుకుపోగా..చెరువులు నిండిన సమయంలో నీళ్లు పంటలకు పారడం లేదు. వర్షాకాలంలో తలాపునే నీళ్లుంటున్నా.. పంటలకు పారబెట్టుకోలేని దుస్థితి నెలకొంటుందని వారు వాపోతున్నారు. కాల్వల్లో నిండిన మట్టిని పూడికతీత, పిచ్చి మొక్కలను సైతం తొలగించడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

రైతన్నకు నిరాశే..

గతేడాది భారీ వర్షాలకు చెరువులు నిండాయని, ఇక సమృద్ధిగా పంటలు పండించుకోవచ్చని ఆశపడిన రైతులకు నిరాశే మిగిలింది. మట్టి కాల్వలు మూసుకుపోవడంతో పంటలకు నీళ్లు పారలేదు. ఈ యేడు వర్షాలు ఆశించిన స్థాయిలో పడకపోవడంతో చెరువులు ఇంకా నిండలేదు. ఆయకట్టు రైతులు వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. కేవలం బోర్ల కింద మాత్రమే సాగుకు సిద్ధమవుతున్నారు. ఆయకట్టు భూమి పడావుగానే కనిపిస్తోంది.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

> చెరువుల ఆయకట్టు కింద వేసిన పంటలకు నీళ్లు పారే పంట కాల్వల నిర్మాణం కోసం రైతుల కోరిక మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. నిధులు మంజూరు కాగానే కాల్వల నిర్మాణం పనులను మొదలుపెడతాం.
> : రవికిషోర్, నీటిపారుదల శాఖ ఈఈ

పథకాల అమలుపై ఆరా

- త్వరలో అధికారులకు నివేదిక
- ఎన్ఎల్ఎం సభ్యుడు సురంజన్‌రెడ్డి



అధికారులు, ప్రజలతో ఎన్ఎల్ఎం టీం సభ్యులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులపై ఎన్ఎల్ఎం (నేషనల్ లెవల్ మానిటరింగ్) బృందం ఆరా తీసింది. మంగళవారం బృందంతో కలసి చిలప్‌చెడ్‌ను బృందం సందర్శించింది. 2023–24, 2024–25 పనులకు సంబంధించిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు, నర్సరీ, సీసీ రోడ్లు, గ్రామంలో ఉన్న మహిళ సంఘాల గ్రూపు వివరాలు, జాబ్ కార్డుల వివరాలు, తదితర వాటి గురించి సంబంధిత అధికారులను, గ్రామప్రజలను అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ పెన్షన్‌లు, జాబ్ కార్డులు ఉన్నాయా. పని దినాలు సద్వినియోగం చేసుకుంటున్నారా లేదా అని ఆరా తీశారు. మహిళ సంఘాలకు అందే రుణాలతో ఏ విధమైన అభివృద్ధి సాధించారో, మహిళలతో మాట్లాడి తెలుసుకున్నారు. సేకరించిన వివరాల తుది నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని బృందం సభ్యుడు సురంజన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఈజీఎస్ హెచ్ఆర్ మేనేజర్ రాజేందర్, ఎన్ఎల్ఎం టీం సభ్యుడు సాదిక్‌అలీ, పీఆర్ డీఈ అమరేశ్వర్, ఎంపీడీఓ కలీముల్లా, ఏపీఓ శ్యామ్, పీఆర్ఏఈ మారుతి, ఇన్‌చార్జి ఎంపీఓ తిరుపతి, పంచాయతీ కార్యదర్శి కృష్ణ పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారం వేగవంతం చేయాలి: ఆర్డీఓ మహిపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆర్డీఓ మహిపాల్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): భూ భారతి సదస్సులలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలని నర్సాపూర్ ఆర్డీఓ మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కౌడపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది, భూభారతి సదస్సులలో వచ్చిన దరఖాస్తులను ఆగస్టు 15వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ కృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ జహీర్, ఆర్ఐ శ్రీహరి పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు సర్కారు చేయూత

అదనపు డీఆర్డీఓ సరస్వతి



మాట్లాడుతున్న సరస్వతి

మనోహరాబాద్(తూప్రాన్): మహిళా సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత అందిస్తుందని అదనపు డీఆర్డీఓ సరస్వతి అన్నారు. మంగళవారం మనోహరాబాద్ మండల సమైక్య కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ఆమె హాజరై మహిళలకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. బ్యాంక్ లింకేజీ క్యాష్ లెస్ కార్యక్రమం గురించి అవగాహన కల్పించారు. బ్యాంకులో తీసుకున్న రుణాలను శ్రీనిధి మహిళా రుణాల మాదిరిగా ఆన్‌లైన్‌లో చెల్లించుకోవచ్చన్నారు. ఈ విధానం అమలుతీరు, మహిళలకు ప్రయోజనం కలిగే విధానాలను తెలుసుకునేందుకు జిల్లాలో మనోహరాబాద్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేశారని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా రుణాలు చెల్లించడం వల్ల మహిళలకు ఇబ్బందులు తొలగుతాయని, ఈ కార్యక్రమం క్షేత్రస్థాయిలో విజయవంతం అయితే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం పెంటాగౌడ్, అధ్యక్షురాలు లత, రాణి, రమ్య, గంగ, కార్యనిర్వహణ సభ్యులు, సీసీలు కృష్ణవేణి, విజయలక్ష్మి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

పచ్చి రొట్టతో అధిక లాభాలు

నిజాంపేట(మెదక్): వరి నాటు వేసుకునే రైతులు పచ్చి రొట్ట(జీలుగు) ఎరువులు వాడటం వల్ల అధిక లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి అన్నారు. పచ్చి రొట్ట చల్లిన 40 రోజుల తర్వాత పూత దశలో కలియ దున్నడం వల్ల కర్బన సేంద్రియ ఎరువులు, నత్రజని, భాస్వరం వంటి పోషకాలు వరి పంటకు పుష్కలంగా దొరుకుతాయన్నారు. ఎరువులు మురగడానికి సింగిల్ పాస్ఫేట్‌ను కలియ దున్ని దానిలో చల్లుకుంటే నత్రజని ఫిక్సింగ్ బ్యాక్టీరియా కూడా లభిస్తుందని తెలిపారు. ఈ ఏడాది 200 క్వింటాలు రాయితీ ద్వారా సరఫరా చేసినట్లు తెలిపారు. దీని ద్వారా సుమారుగా 1,458 ఎకరాల్లో రైతులు పంట పండించారని తెలిపారు.

ఉల్లి సాగుకు రాయితీ

ఉద్యానశాఖ అధికారి సంతోష్

రేగోడ్(మెదక్): ఉల్లి సాగుకు ప్రభుత్వం రాయితీ కల్పిస్తోందని ఉద్యాన మండల అధికారి సంతోష్ తెలిపారు. మండల కేంద్రమైన రేగోడ్, టి.లింగంపల్లిలో మంగళవారం కూరగాయల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉల్లి సాగు చేసే రైతులకు ఎకరానికి రూ.8 వేలు రాయితీ కల్పిస్తోందని చెప్పారు. విత్తనాలు, ఎరువులు, చీడపీడల నివారణకు కొనుగోలు చేసిన మందుల రశీదులతో ఉద్యానవన అధికారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మిరప, వంకాయ, టమాట నారు మళ్లు వందశాతం రాయితీతో అందజేస్తామని, అవసరం ఉన్న రైతులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోండి

తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ నీరవ్



చెక్కులు పంపిణీ చేస్తున్న మేనేజర్ నీరవ్, బ్యాంకు సిబ్బంది

పెద్దశంకరంపేట (మెదక్): బీమా పథకాలను వినియోగించుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ నీరవ్ అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేట శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు బాధితులకు బీమా చెక్కులను అందజేశారు. మండలంలోని వీరోజుపల్లికి చెందిన గుత్ప సాయిలు, లింగాయపల్లి రాజు, సోమ్లా తండాకు చెందిన లంబాడి గోపాల్, బోడగట్టుకు చెందిన తంగేడుపల్లి లక్ష్మీ, కమ్మరికత్తకు చెందిన వెంకయ్యగారి రాములు వివిధ కారణాలతో మరణించారు. వీరందరూ బ్యాంకులో పీఎం జేజేబీవై బీమాను సంవత్సరానికి రూ.436, పీఎం ఎస్‌బీవై కింద రూ.20లు బీమా చేశారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2లక్షలు చొప్పున నామినీ ఖాతాలో జమ చేసినట్లు మేనేజర్ తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అధికారి వినయ్, సీఎఫ్ఎల్ కౌన్సిల్ ఎం.అజయ్‌కుమార్, కె.మహేశ్వర్‌గౌడ్, బ్యాంకు మిత్ర నవీన్ కుమార్, వీరోజీపల్లి కార్యదర్శి సిద్దు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో ప్రాతినిథ్యం కల్పించాలి

వికలాంగుల హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు దేవయ్య



కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న వేదిక సభ్యులు

పాపన్నపేట(మెదక్): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు ప్రాతినిథ్యం కల్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు మంగళవారం వినతి పత్రం ఇచ్చినట్లు జాతీయ వికలాంగుల హక్కుల వేదిక జిల్లా అధ్యక్షులు దేవయ్య తెలిపారు. గ్రామ పంచాయతీలు, జిల్లా, మండల పరిషత్లలో నామినేటెడ్ సభ్యులుగా నియమించాలని డిమాండ్ చేశారు. పాలనా వ్యవస్థలో వికలాంగులకు ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా వారికి అవసరమైన సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతగా అమలవుతాయని పేర్కొన్నారు. అలాగే రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లు, వికలాంగుల ఫించన్‌లు కోటా ప్రకారం అందుతాయన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నాసిర్, ఖాజా పాల్గొన్నారు.

ఆయిల్‌పాంలో తెలంగాణ టాప్

రిసోర్స్ పర్సన్ రంగనాయకులు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాపన్నపేట(మెదక్): ఆయిల్‌పాం సాగులో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని రిసోర్స్ పర్సన్ రంగనాయకులు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని పొడిచన్‌పల్లి రైతు వేదికలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆయిల్‌పాం పంట విస్తీర్ణం పెంచేందుకు ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు ఇస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, బీసీలకు 90 శాతం, ఇతర వర్గాలకు 80 శాతం సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. ఎరువులు, డ్రిప్ పరికరాలు, ఇతర అంతర పంటలకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు వివరించారు. నాటిన 4వ యేడు నుంచి 30 యేళ్ల వరకు రైతులకు ఫలసాయం అందుతుందన్నారు. ఎకరాకు సుమారు రూ.1.54 లక్షల పంట పొందవచ్చన్నారు. ఈ పంటను చీడ పీడలు, కోతులు, అడవి జంతువులు నాశనం చేయవన్నారు. పాపన్నపేట మండలంలో 25 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగులో ఉందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగమాధురి, ఏఈఓలు అభిలాష్, ఫీల్డ్ ఆఫీసర్ శంకర్ పాల్గొన్నారు.

డ్రోన్‌తో పిచికారీ.. డబ్బు ఆదా: ఏఓ



అవగాహన కల్పిస్తున్న రాంప్రసాద్

టేక్మాల్(మెదక్): డ్రోన్ సహాయంతో మందుల పిచికారీ చేసినట్లయితే సమయంతో పాటు డబ్బు ఆదా అవుతుందని వ్యవసాయ అధికారి రాంప్రసాద్ తెలిపారు. మంగళవారం టేక్మాల్ మండలంలోని తంప్లూర్ గ్రామంలో వ్యవసాయంలో డ్రోన్‌ల వినియోగం, నానో యూరియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పురుగు మందులను పిచికారీ చేయడానికి డ్రోన్‌లను ఉపయోగించడం వల్ల రసాయనాలు పంటలపై ఏకరీతిగా ప్రయోగించబడతాయని పేర్కొన్నారు. పంట అధిక దిగుబడికి దారితీస్తుందన్నారు. నానో యూరియా ఉపయోగించిన రసాయనాల మొత్తాన్ని తగ్గించడంలో కూడా సహాయపడుతుందని చెప్పారు. పర్యావరణానికి ప్రయోజనకరంగా అదనంగా, డ్రోన్‌లు తక్కువ వ్యవధిలో పెద్ద ప్రాంతాన్ని కవర్ చేయగలవన్నారు. యూరియా వాడకాన్ని పూర్తిగా తగ్గించి నానో యూరియాను వాడాలని సూచించారు. నానో యూరియా వాడకంపై ఎటువంటి అపోహలు వద్దని సూచించారు.

బడులకు వెళ్లేలా ప్రోత్సహించాలి

- ఆపరేషన్ ముస్కాన్‌లో 84మంది బాలల సంరక్షణ
- జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు వెల్లడి



సమావేశంలో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, ఆయా శాఖల అధికారులు

మెదక్ మున్సిపాలిటీ: బడీడు పిల్లలను బడికి వెళ్లేలా ప్రతీ ఒక్కరు ప్రోత్సహించాలని, బాల కార్మికులుగా మారనివ్వొద్దని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మెదక్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆపరేషన్ ముస్కాన్‌పై మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 20 రోజుల్లో 84 మంది పిల్లలను గుర్తించామన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 50 కేసులను నమోదు చేసినట్లు తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో ఆపరేషన్ ముస్కాన్ దిగ్విజయంగా కొనసాగుతుందని తెలిపారు. బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని జగ్గంపేటలో మంగళవారం ప్రధానమంత్రి ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని నిర్వహించామని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ సతీష్‌కుమార్ తెలిపారు. పీఎం సురక్ష బీమా యోజన, జీవన్‌జ్యోతి యోజన, అటల్ పెన్షన్ యోజన, ఇతర బీమా పథకలపై అవగాహన కల్పించామని పేర్కొన్నారు. ఖాతాదారులు సైబర్ మోసగాళ్ల వలలో చిక్కకుండా జాగ్రత్త పడాలన్నారు. బ్యాంక్ అధికారులు, ఖాతాదారులను, ఓటీపీ. ఇతర వివరాల కోసం ఎలాంటి కాల్స్ చేయరన్నారు.

◆ మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అనుకున్న లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలని తూప్రాన్ సబ్ డివిజన్ షీ టీం హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కౌడిపల్లి బాలికల పాఠశాలలో సైబర్ క్రైం, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోవద్దన్నారు. మొబైల్‌లో అనవసర లింక్‌లపై క్లిక్ చేసి, ఖాతాలో డబ్బులు పోగొట్టుకోకుండా జాగ్రత్త పడాలన్నారు. కార్యక్రమంలో షీటీం డబ్ల్యూపీసీ గంగమణి, హెచ్ఎం సాజిద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

◆ కార్యదర్శులు అందుబాటులో ఉండాలి

కౌడిపల్లి(నర్సాపూర్): పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. వర్షాకాలం సందర్భంగా గ్రామాలలో సంపూర్ణ పారిశుద్ధ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్య, వైద్యం, పోషకాహారం, తదితర ప్రభుత్వ శాఖలు చేపట్టే పనుల వివరాలు సేకరించాలన్నారు. గ్రామాలలో బాల్య వివాహాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఏపీఓ పుణ్యదాస్ పాల్గొన్నారు.

◆ టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు

పాపన్నపేట(మెదక్): శేరిపల్లి శివారులోని కందనివాడి కుంట నుంచి మట్టిని రవాణా చేస్తున్న టిప్పర్లను స్థానికులు అడ్డుకున్నారు. ఈ సంఘటన మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. కొంతమంది కుంట నుంచి టిప్పర్లలో మట్టిని రవాణా చేస్తున్నారని, దీని వల్ల నాగ్సాన్‌పల్లి రోడ్లు, మిషన్ భగీరథ పైప్‌లైన్లు పగిలి పోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మట్టిని తీసుకెళ్తున్న టిప్పర్లను ఆపేశారు. పరిమితికి మించిన లోడ్‌తో టిప్పర్లు రోడ్డుపై ప్రయాణించడం వల్ల గ్రామస్తులకు పిల్లలకు ప్రమాదం పొంచి ఉందన్నారు.